www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
ఆదివారం | 18 | అక్టోబర్ | 2026
పేజీలు : 8

## జర్నలిస్టుల నివాస స్థలాల సమస్యను పరిష్కరించండి



**-రైతు భూమికి భరోసా.. పంటలకు రక్షణ**
**-సీతారామ కాలువలకు పైపులు**
**-ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరిన మంత్రి తుమ్మల**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్రంలో జర్నలిస్టుల నివాస స్థలాల సమస్యను పరిష్కరించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఖమ్మం నియోజక వర్గ జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యను త్వరగా పరిష్కరించి అర్హులకు స్థలాలు అందజేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన మంత్రి తుమ్మల ఉమ్మడి జిల్లాతో పాటు ఖమ్మం నియోజక వర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి

మిగతా 2లో..

# ఐక్యతతోనే బలోపేతం



**-ఎర్రజెండాలతోనే ప్రజలకు రక్ష**
**-సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని**
**-కమ్యూనిస్టు సిద్ధాంతాల వైపు యువత : తమ్మినేని**
**-ప్రజా ఉద్యమ నిర్మాణమే అమరులకు నివాళి**
**-కృష్ణయ్య సంస్మరణ సభలో వామపక్ష నేతలు**

**ప్రజాపక్షం/ నేలకొండపల్లి :** ఐక్య కార్యాచరణతో పాటు ఐక్యంగా ప్రజల ముందు నిలబడినప్పుడే కమ్యూనిస్టులు బలోపేతం కావడంతో పాటు రాజ్యాధికారం దక్కుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి , కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. విడివిడిగా పనిచేయడం వల్ల ఆశించిన ఫలితాలు సాధించలేకపోతున్నామని ఐక్య కార్యాచరణతో పాటు ఐక్యంగా ప్రజల ముందు నిలబడాలన్నారు. సిపిఐ నాయకులు, తెలంగాణ సాయుధ పోరాట యోధులు, మాజీ శాసన సభ్యులు కర్నాటి కృష్ణయ్య 28వ వర్థంతి సభ శనివారం స్థానిక సిపిఐ కార్యాలయం వద్ద జరిగింది. సభకు ముందు సిపిఐ, సిపిఎం, సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ నాయకులు , కార్యకర్తలు కృష్ణయ్య స్మారక స్తూపం వద్ద పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ పతాకాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఆవిష్కరించారు. అనంతరం దండి సురేష్ అధ్యక్షతన జరిగిన వర్థంతి సభలో సాంబశివరావు మాట్లాడుతూ నిరంతరం ప్రజల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారం కోసం పోరాడేది కమ్యూనిస్టులే అన్నారు. దేశం ఒక సంక్లిష్ట స్థితిని ఎదుర్కొంటుందని ఇప్పుడిప్పుడే బూర్జువా పార్టీలు చేయలేని పని కమ్యూనిస్టులు చేయగలరన్న విశ్వాసం ప్రజల్లో పెరుగుతుందన్నారు. అందుకు ఇటీవల ఆర్టీసి ఎన్నికల్లో కమ్యూనిస్టులు సాధించిన విజయమేనని సాంబశివరావు గుర్తు చేశారు. కమ్యూనిస్టు ఉద్యమం బలోపేతం కావాలంటే ఐక్యత ముఖ్యమని ఆయన మరోమారు స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పాలకులు వైఫల్యం చెందారని మోడీ పాలన ప్రజల కోసం కాకుండా సంపన్నుల కోసం మాత్రమే సాగుతుందన్నారు. దేశంలో ఆర్థిక అంతరాలు పెరిగి ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకోలేని

మిగతా 8లో..

## మిత్రునికి మద్దతునిస్తారా.. పోటీ చేస్తారా..!?




**-ఎంఎల్‌సీ ఎన్నికపై తేల్చని కమలం**
**-ప్రచారంలో జనసేన ...**
**కాంగ్రెస్ అభ్యర్థిగా రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి**
**-ఇంకా తేల్చని బిఆర్ఎస్**
**-పోటీ ఆలోచనలో వామపక్షాలు**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** పట్టభద్రుల శాసన మండలి సభ్యుని ఎన్నికకు సంబంధించి రాజకీయ వేడి మొదలైంది. ఖమ్మం నల్గొండ వరంగల్ పట్టభద్రుల నియోజక వర్గంలో ఓటర్ల చేర్పింపు ప్రక్రియను రాజకీయ పార్టీలు వేగవంతం చేశాయి. అర్హత కలిగిన వారు స్వచ్ఛందంగా ఓటు కోసం దరఖాస్తు చేసుకుంటుండగా రాజకీయ పార్టీలు ఓటు నమోదుకు సంబంధించి చేర్పింపు ప్రక్రియను ప్రత్యేకంగా చేపట్టాయి. పట్టభద్రులను గుర్తించి వారిని చేర్పించేందుకు గ్రామ, మండల స్థాయి నుంచి ఒక ప్రత్యేక కార్యాచరణ చేపట్టాయి. ఓట్ల చేర్పింపు కార్యక్రమం ఇలా కొనసాగుతుండగా అందరి కంటే ముందుగా జనసేన ఎంఎల్‌సి అభ్యర్థిని ప్రకటించింది. అభ్యర్థి ప్రకటన తర్వాత జనసేన అధ్యక్షులు, ఏపి ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎంఎల్‌సి ఎన్నికల ప్రచార రథాన్ని కూడా ప్రారంభించారు. జనసేన అభ్యర్థిగా మాజీ ప్రభుత్వ అధికారి గడల శ్రీనివాస రావు పోటీ చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో జనసేన, టిడిపి, బిజెపిలు మిత్ర పక్షాలుగా కొనసాగుతున్నాయి. త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో సైతం అక్కడ పొత్తుతోనే రంగంలోకి దిగాయి. కానీ తెలంగాణలో బిజెపి జనసేనకు మద్దతునిస్తుందా లేక ఖమ్మం వరంగల్ నల్గొండ పట్టభద్రుల నియోజక వర్గం నుంచి బిజెపి మిత్రత్వాన్ని కాదని పోటీ చేస్తుందా అన్నది తేలాల్సి ఉంది. గతంలో జరిగిన ప్రతి ఎన్నికలోనూ ఈ నియోక వర్గం నుంచి బిజెపి పోటీ చేసి గణనీయమైన ఓట్లు సాధించింది. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్ పట్టభద్రుల నియోజక వర్గం నుంచి బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు పేరు వినపడుతున్న నేపథ్యంలో ఖమ్మం వరంగల్ నల్గొండ స్థానం నుంచి అభ్యర్థిని పోటీ పెడతారా లేదా అన్నది పార్టీ నిర్ణయించ లేదు. జనసేన అభ్యర్థి మాత్రం బిజెపి తమకు మద్దతునిస్తుందన్న నమ్మకంతో ముందుకు సాగుతున్నారు. కాంగ్రెస్ ఈ నియోజక వర్గం నుంచి అభ్యర్థిని ఎంపిక చేసింది. మాజీ మంత్రి

మిగతా 2లో..






# మిత్రునికి మద్దతునిస్తారా.. పోటీ చేస్తారా..!?

(మొదటిపేజీ తరువాయి)

రాంరెడ్డి దామోదర్‌రెడ్డి కుమారుడు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డిని తమ అభ్యర్థిగా ప్రకటించింది. ఇప్పటికే ఒక దఫా జిల్లాకు చెందిన కాంగ్రెస్ మంత్రులు సన్నాహాక సమావేశాన్ని సైతం నిర్వహించారు. బిఆర్‌ఎస్ ఎంఎల్‌సి ఓట్ల చేర్పింపు కార్యక్రమంలో ఉన్నప్పటికీ అభ్యర్థిని మాత్రం ప్రకటించ లేదు. గతంలో పోటీ చేసిన ఏనుగుల రాకేష్‌రెడ్డి మరోసారి బరిలోకి దిగే అవకాశం ఉంది. రాకేష్‌రెడ్డి ఇప్పటికే తొలి దశ ప్రచారాన్ని పూర్తి చేశారు. బిఆర్‌ఎస్ నాయకులు నియోజక వర్గ స్థాయి సమావేశాలు ఏర్పాటు చేసి ఓట్ల చేర్పింపుపై కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ నియోజక వర్గంలో వామపక్షాలు గణనీయమైన ఓట్లు కలిగి ఉన్నాయి. గతంలో ఇక్కడి నుంచి సిపిఎం, సిపిఐ కూడా పోటీ చేశాయి. గత ఎన్నికల్లో మాత్రం కలిసి పోటీ చేశాయి. ఈ దఫా ఇప్పటికీ పోటీ పై నిర్ణయం చేయనప్పటికీ పోటీ చేసే ఆలోచనలో ఉన్నట్లు వినికిడి. శాసనసభ ఎన్నికలకు రెండేళ్ల ముందు జరుగుతున్న ఈ ఎన్నికల్లో దాదాపు సగానికి ఎక్కువ జిల్లాల పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల ఫలితాల ప్రభావం రానున్న సాధారణ ఎన్నికలపై ఖచ్చితంగా ప్రభావం చూపుతుందన్న ఆలోచనలో రాజకీయ పార్టీలు అభ్యర్థులను బరిలోకి రంగంలోకి దించుతున్నాయి. స్థానిక నాయకత్వం సైతం ఎంఎల్‌సి ఎన్నికల ఓట్ల చేర్పింపు సమావేశాల విషయంలో ఖచ్చితమైన కార్యాచరణతో పని చేస్తున్నాయి. బిజెపి పోటీ లేదా మద్దతు వ్యవహారం ఈ ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

## ఘనంగా బతుకమ్మ వేడుకలు



ప్రజాపక్షం/చింతకాని : బతుకమ్మ సంబరాల్లో భాగంగా చింతకాని మండల పరిషత్ కార్యాలయంలో మహిళా ఉద్యోగులు, పంచాయతీ కార్యాదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా బతుకమ్మలు పేర్చి గౌరీ పూజ చేసి నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సూపరెండెంట్ జానీమియా, ఎంపీవో పర్వీన్‌కైసర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల నివాస స్థలాల సమస్యను పరిష్కరించండి

(మొదటిపేజీ తరువాయి)

కార్యక్రమాలకు సంబంధించి ఎల్‌నినో కారణంగా ఏర్పడిన పరిస్థితులను అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రైతుల భూమిని కాపాడడంతో పాటు సాగునీటి ప్రాజెక్టుల వ్యయాన్ని తగ్గించేందుకు పైపులతో నీరు అందించేందుకు పనులు ప్రారంభించాలని ఆయన ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నీటిని నిల్వ చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలను ఆయన వివరించారు. జిల్లాకు సంబంధించి అభివృద్ధి కార్యక్రమాల నివేదికతో పాటు ఖమ్మం నియోజక వర్గానికి సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాల జాబితాను అందజేశారు. సీతారామ ఎత్తిపోతల పథకం నీటి పంపిణీకి సంబంధించి వీలైన ప్రతి చోట పైపుల నిర్మాణం చేయాలని ఆయన కోరారు. ఆయిల్ పామ్ తోటల్లో విద్యుత్ లైన్ల ద్వారా అగ్ని ప్రమాదాలు జరగకుండా కవర్డ్ కండక్టర్లుగా మార్చేందుకు రాష్ట్రస్థాయి ఉమ్మడి విధానాన్ని రూపొందించాలని కోరారు. దుమ్ముగూడెం వద్ద ఇసుక బస్తాలతో నీటిని నిల్వ చేసేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. రూ. 30 లక్షల ఖర్చుతో ఇసుక బస్తాల ద్వారా నీటిని నిల్వ చేయవచ్చునన్నారు. పైపులైన్ల ద్వారా నీటిని అందించడం ద్వారా భూమి ఆదా అవుతుందని 9767 ఎకరాల భూమి ఆదా కావడంతో పాటు రూ.2148.74 కోట్లు మిగులుతాయని ఆయన అంచనా వేసి ముఖ్యమంత్రికి వివరించారు. సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా పినపాక, కొత్తగూడెం, అశ్వారావుపేట, సత్తుపల్లి, వైరా, ఖమ్మం నియోజక వర్గాల్లోని స్థిరీకరణతో పాటు 674387 ఎకరాలకు నీటిని అందించవచ్చునని ఆయన తెలిపారు. యతాలకుంట టన్నెల్ పనులు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఈ పనులు పూర్తి చేస్తే సత్తుపల్లి, వేంసూరు, అశ్వారావుపేట, దమ్మపేట మండలాలకు సాగునీరు, తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవచ్చునని మంత్రి తుమ్మల ముఖ్యమంత్రికి తెలియజేశారు. జూలూరుపాడు వద్ద టన్నెల్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మంత్రి తుమ్మల కోరారు. ఖమ్మంలో నిర్మిస్తున్న వెలుగుమట్ల మోడల్ కాలనీ ప్రారంభానికి రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మంత్రి తుమ్మల కోరారు.




## ఆధారాలుంటే అధికారుల ముందు చూపించాలి

**-సీడీపీఓ అరుణకుమారి**



ప్రజాపక్షం/ఇల్లందు: తనపై ఇల్లందు మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యాలయ పనితీరుపై కువ్వారపు సరిత చేసిన ఆరోపణలు నిరాధారమైనవని ఇల్లందు ప్రాజెక్టు సీడీపీఓ డాక్టర్ కె అరుణకుమారి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. తాను, కార్యాలయ సిబ్బంది విధి నిర్వహణలో ఎల్లప్పుడూ నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వ్యవహరిస్తున్నామని తెలిపారు. తనపై ఆరోపణలు చేసే వారు వాటికి సంబంధించిన ఆధారాలను మీడియా లేదా సంబంధిత అధికారుల ముందు చూపించాలని సూచించారు. స్వార్థ ప్రయోజనాల కోసమే ఇటువంటి ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఆధారాలు లేని ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని, ప్రజలు, మీడియా ప్రతినిధులు వాస్తవాలను పరిశీలించి ఇటువంటి ప్రచారాలను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.







## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ప్రజాపక్షం/మధిరః నాలుగు దశాబ్దాల క్రితం సుదీర్ఘ నిరీక్షణ తర్వాత స్నేహితులంతా ఒకే వేదికపై ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ ఆనందోత్సవాల మధ్య ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని పరవశించిపోయారు. మధిరలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1986–88 మధ్య ఇంటర్మీడియట్ బైపిసి చదివిన పూర్వ విద్యార్థులు మధిరలోని రెడ్డి గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేలనం కార్యక్రమం వైభవంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, రేగళ్ల సాంబశివరావు, జంగా రామకృష్ణ, షేక్ బాబు, సంగమేశ్వరరావు, సీతారాములు, యాదగిరి, పివి.బ్రహ్మం, డాక్టర్ లీలాప్రసాద్, రమేష్, మురళి, అరుణ, కోన ధనలక్ష్మి, పద్మ, జ్యోతి, వాణి, కృష్ణప్రియ, ఎంపిడివో భారతి తదితరులు పాల్గొన్నారు.






# నిరుపయోగంగా మంచినీటి పథకాలు..!



**-ఇబ్బందులు పడుతున్న ప్రజలు**
**-చాలిచాలని నీటితో ఇబ్బందులు పడుతున్న ప్రజలు**

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండలం మర్లపాడు, యజ్ఞ నారాయణపురం గ్రామాలలో గత పది సంవత్సరాలు క్రితం మిషన్ భగీరథ మంచి నీటి పథకం ద్వారా నిర్మించిన ఈ ట్యాంక్‌ల కు నీరు ఎక్కనందున ఉపయోగంలో లేనందున నిరుపయోగంగా మారాయి. వీటికి నిర్మించిన నిధులు ఈ ట్యాంకు పని చేయనందున ప్రజల్లో నిధులు ఈ పథకం ద్వారా కరిగిపోయాయని ఆయా గ్రామాల్లో ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రతిరోజు ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించేందుకు లక్ష్యంగా ఈ ట్యాంకులను నిర్మించగా ఆ లక్ష్యానికి తూట్లు పడ్డాయి, మండల పరిధిలోని ఇంకను పలు గ్రామాలలో ఇదేవిధంగా నీరు ట్యాంకులకు ఎక్కనందున ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు వారు పేర్కొంటున్నారు. వీటికి పైపులైన్లు నిర్మించిన కూడా సాంకేతికంగా నీరు ట్యాంక్ లకు ఎక్కడనందున ఇబ్బందులు పడుతున్నట్లు ప్రజలు తెలుపుతున్నారు. మండలంలో తరచూ మరమ్మత్తులు వస్తున్నందున నేరుగా మోటార్ ద్వారా ప్రజలకు అందిస్తున్నట్లు యజ్ఞ నారాయణపురం సర్పంచ్ వివరిస్తున్నారు. ట్యాంక్ మాత్రం నిరుపయోగంగా మారిందని సర్పంచ్ పేర్కొంటున్నారు. అదేవిధంగా మర్లపాడు సర్పంచ్ కార్యదర్శులను వివరణ కోరగా సాంకేతిపరంగా నీరు ఎక్కడం లేదని వేరే పైపైన ద్వారా చేస్తున్నామని ఈ విధంగా పైపులను సాంకేతిపరంగా నిర్మించిన కూడా ట్యాంక్ కు నీరు ఎక్కడం లేదని లేదని గ్రామ సర్పంచ్ వివరించారు. దీని వలన ట్యాంకులు నిరుపయోగంగా మారాయని ఆయా గ్రామాల సర్పంచులు వివరిస్తున్నారు. సమస్యను పరిష్కరించాలని ఆ గ్రామాల ప్రజలు సర్పంచులను అధికారులను కోరుతున్నారు.

# రైతాంగం పట్ల రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి విడనాడాలి

**- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నాయకుడు మిడకంటి చిన్న వెంకటరెడ్డి**
**-ముత్తగూడెంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం సభ్యత్వ నమోదు**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** రైతంగం పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని విడనాడి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నాయకుడు మిడకంటి చిన్న వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఖమ్మంరూరల్ మండలం ముత్తగూడెం గ్రామంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమానిన మిడకంటి చిన్న వెంకటరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...జిల్లాలోని 16మండలాల్లో సగటు వర్షపాతం కంటే తక్కువ వర్షపాతం నమోదైన నేపథ్యంలో పంట నష్టపరిహారం అందని పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంటల బీమా పథకాన్ని అమలు చేయకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని, రైతు బీమా ప్రీమియం చెల్లించి పథకాన్ని కొనసాగించాలన్నారు. ఎల్‌నినో ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు వరి, మొక్కజొన్న పంటలకు రూ.30వేల చొప్పన, పత్తి, మిర్చి పంటలకు రూ.50వేల చొప్పున నష్టపరిహారం అందించాలని కోరారు. అలాగే రైతులకు నాణ్యమైన విద్యుత్తును నిరంతరాయంగా సరఫరా చేయాలని, సీతారామ ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సాగు నీరు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అంతేకాకుండా రైతుల న్యాయమైన పలు డిమాండ్ల కోసం పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బానోత్ రాంకోటి, వెన్నం భాస్కర్, రామకృష్ణ, రమేష్, రామస్వామి, ప్రభుదాస్, వెంకన్న, కృష్ణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి సమష్టిగా కృషి చేయాలి



**ఎంపి రామసహాయం, ఎమ్మెల్యే రాగమయి**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డి విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఎంపి రామసహాయం రఘురాం రెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా.మట్టా దయానంద్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా ఎంపి రామ సహాయం రఘురాంరెడ్డి , ఎమ్మెల్యే రాగమయిదయానంద్ పాల్గొని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువతకు పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పట్టణాలు, గ్రామాలు, వార్డుల పరిధిలో ఆన్‌లైన్ ద్వారా ఓటరు నమోదు చేసుకునేలా పార్టీ శ్రేణులు అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం మండల పరిధిలోని యాతాలకుంటలో లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అక్కడి నుండి నేరుగా సీతారామ ప్రాజెక్ట్ టన్నెల్ వద్దకు చేరుకొని పనులను పరిశీలించారు. సీతారామ అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించి, ఎప్పటి వరకు పూర్తవుతుంది తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీ నారాయణ, మున్సిపల్ చైర్మన్ రిహానా కమల్ పాషా, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గాదె చెన్నారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, వార్డు కౌన్సిలర్లు జొన్నలగడ్డ శ్రీనివాసరావు, దూదిపాళ్ల రాంబాబు సొసైటీ అధ్యక్షుడు చల్లగుండ్ల కృష్ణయ్య, కార్యకర్తలు, ఎన్ఎస్‌యుఐ, యువజన, మహిళా విభాగాల ప్రతినిధులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# మధిర కోర్టులో నూతన రికార్డ్ రూమ్ ప్రారంభం



**ప్రజాపక్షం/మధిర:** ఖమ్మం జిల్లా మధిర కోర్టు ఆవరణలో నూతనంగా నిర్మించిన రికార్డుల రూమ్ తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సురేపల్లి నంద శనివారం ప్రారంభించారు. మధిర కోర్టుకు తొలిసారిగా విచ్చేసిన హైకోర్టు పరిపాలనా న్యాయమూర్తి జస్టిస్ సురేపల్లి నందకు ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి, ఎం.నాగరాజు, మధిర జూనియర్ సివిల్ జడ్జి దీప్తి వేములు, మధిర బార్ అసోసియేషన్ అధ్యక్షులు చావలి రామరాజు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేదాశీర్వచనాలు అందించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, సీనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ నూతన రికార్డు రూమ్ అందుబాటులోకి రావడం వలన మధిర కోర్టుకు సంబంధించిన పాత రికార్డులు, కేసుల ఫైళ్లను మరింత భద్రంగా క్రమ పద్ధతిలో నిర్వహించడానికి వీలవుతుందని పలువురు తెలిపారు.

## శ్రీదేవీ నవరాత్రుల సందర్భంగా మహా అన్నదానం



**ప్రజాపక్షం/ముదిగొండ:** మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి, శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీదేవీ నవరాత్రుల సందర్భంగా వారాహి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారి విగ్రహం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేసి, భక్తులకు అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ మహా అన్నదాన కార్యక్రమాన్ని ముదిగొండ ఎస్సై అశోక్ ప్రారంభించి మాట్లాడారు. ఆలయాల్లో నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తి భావాన్ని పెంపొందించడంతోపాటు, సామాజిక ఐక్యతకు దోహదపడుతాయని పేర్కొన్నారు. అమ్మవారిని దర్శించేందుకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు వారాహి కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కట్టకూరి ఉపేందర్, ఏఎస్ఐలు సత్యనారాయణ, శ్రీనివాస్, వారాహి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మహాలక్ష్మి దేవి అలంకారంలో అమ్మవారు



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన స్వయంభు జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నందు శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 7వరోజు శనివారం శ్రీ మహాలక్ష్మీ దేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 5గంటల నుంచి నిత్య అర్చనలు, అనుస్థానములు, హోమాలు, మండపారాధనలు నిర్వహించారు. ఉదయం 10గంటల నుండి సామూహిక చండీ హోమం నిర్వహించారు.అధిక సంఖ్యలో భక్తులు, స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ కొత్తూరు జగన్మోహన్‌రావు, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు మురళీమోహన్‌శర్మ, మూర్తి వెంకటరమణ, రఘురామకృష్ణ శాస్త్రి, రాజీవ్‌శర్మ, వేద పండితులు, ఇతర ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండల పరిధిలోని జమలాపురం గ్రామంలో శ్రీ వెంకటేశ్వర అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు బొబ్బ కృష్ణ ప్రసాద్, ఎల్వి నారాయణరెడ్డి తెలిపారు. శనివారం ఎన్టీఆర్ జిల్లా మొరుసుమల్లి గ్రామానికి చెందిన గొల్లపూడి నాగమల్లేశ్వరరావు, చిట్టికుమారి దంపతులు కుమారుడు విష్ణువర్ధన్, కుమార్తె సంధ్యల వితరణతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దాతలు సహకరిస్తే ప్రతి రోజూ వారి పేరుమీద భక్తులకు ప్రతిరోజూ అన్నదానం చేస్తామని నిర్వాహకులు తెలిపారు. అన్నదానం చేయటం వలన వెంకటేశ్వరస్వామి ఆశీస్సులు వారి కుటుంబాలపై ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు కొడాలి విజయలక్ష్మీ దేవి, ఉపాధ్యక్షులు గిరిజా లక్ష్మీ, యిమ్మిడి ఈశ్వర్‌చంద్ర విద్యాసాగర్, సహాయ కార్యదర్శి చింతా కిషోర్, కోశాధికారి వీరమాచనేని వెంకటకృష్ణ, కాకుమాను లీలాకృష్ణ, విష్ణుమూర్తి, చొప్పవరపు శ్రీనివాసరావు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న వెంపటి జీవనజ్యోతి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని ఖమ్మంబైపాస్‌రోడ్డులోని లక్ష్మి బృందావనం వద్ద ఆటో కారు శనివారం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న పిల్లలు, పెద్దలకు స్వల్ప గాయాలు కాగా ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ క్రమంలో తన తండ్రి సిపిఐ జిల్లా సమితి సభ్యుడు వెంపటి సురేందర్‌తో కలిసి వెళుతున్న డాక్టర్ వెంపటి జీవనజ్యోతి ఆ ఘటనను చూసి చలించిపోయింది. గాయాలయ్యి రక్తంతో తడిచిన వ్యక్తిని తన చేతులతో అక్కున చేర్చుకుని ధైర్యాన్ని కల్పించింది. అలాగే గాయపడిన వారికి భరోసానివ్వడంతో పాటు చికిత్సకై హాస్పిటల్‌కి తరలించడంలో కీలకంగా వ్యవహరించింది. అంతేకాకుండా సిపిఐ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన నేతలు ఈ ప్రమాదంలో గాయపడిన వారికి సహాయం అందివ్వడంలో కీలకంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ప్రమాద సమయంలో స్పందించి బాధితులకు అండగా నిలిచిన యువ డాక్టర్‌తో పాటు సహాయం అందించిన నాయకుల తీరుపై స్థానికులు అభినందనలు వ్యక్తం చేశారు.

## కల్లూరు నూతన ఎస్సైగా నాగరాజు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు నూతన ఎస్సైగా నాగరాజు యాదవ్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బంది శాలువాలతో పూలమాలలతో ఘనంగా సత్కరించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలు కాపాడటం పేకాట, జూదం, కోడిపందాలు, అక్రమాలను అరికట్టడం లాంటివి కాపాడడం కోసం ప్రత్యేక శ్రద్ధ వహిస్తానని ప్రజలు నేరుగా రక్షక భట నిలయానికి వచ్చి కలిసి సమస్యలను విన్నవిస్తే పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజలు సమాజంలో సమన్వయంతో శాంతియుత వాతావరణంలో జీవనాన్ని కొనసాగించాలని ప్రజలు కోరారు.

# వైరాలో సిఎంఆర్ సరఫరాపై మిల్లర్లలో గుబులు..!



-ఇచ్చిన ధాన్యం ఎంత...?
ప్రభుత్వానికి తిరిగి ఇచ్చిన బియ్యం ఎంత...?
-వైరాలో మాత్రం విచారణ ఎక్కడ?
-సిఎంఆర్ ధాన్యం బయటకు తరలించారా?



**ప్రజాపక్షం/వైరా:** తెలంగాణ ప్రభుత్వం రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు కేటాయించి, నిర్దేశిత నిబంధనల ప్రకారం కస్టమ్ మిల్లింగ్ రైస్(సిఎంఆర్) ను తిరిగి ప్రభుత్నాకి అందించే విధంగా ఒప్పందాలు చేసుకుంది. ఇందులో భాగంగా వైరా మండలంలోని పలు రైస్‌మిల్లులకు కూడా భారీగా ధాన్యం కేటాయించినట్లు తెలుస్తుంది. అయితే ప్రభుత్వం మిల్లులకు అప్పగించిన ధాన్యానికి అనుగుణంగా సిఎంఆర్ బియ్యం పూర్తిస్థాయిలో తిరిగి ప్రభుత్వానికి చేరిందా?లేదా? అన్నదే ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా సిఎంఆర్ ధాన్యం, బియ్యం నిల్వలపై అధికారులు తనిఖీలు నిర్వహిస్తూ, నిబంధనలుఉల్లంఘించినట్లు గుర్తించిన మిల్లులపై చర్యలు తీసుకున్నారు. ఖమ్మం జిల్లాలోను పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి, అవకతవకలు గుర్తించిన సందర్భాల్లో కేసులు నమోదు చేసిన ఘటనలు వెలుగులోకి వచ్చాయి. వైరా మండలంలోని మిల్లులకు ప్రభుత్వం ఏ సీజన్‌లో ఎంత ధాన్యం కేటాయించింది? ఆ ధాన్యాన్ని మిల్లర్లు తీసుకున్న తేదీలు ఏమిటి? కేటాయించిన ధాన్యానికి అనుగుణంగా ఎంత సిఎంఆర్ బియ్యం ప్రభుత్వానికి తిరిగి ఇవ్వాలి? ఇప్పటివరకుఎంత బియ్యం అందించారు? ఇంకా ఎంత బియ్యం బకాయి ఉంది? ఈ వివరాలన్నింటినీ అధికారులు బహిరంగంగా వెల్లడించి, మిల్లుల వారీగా లెక్కలు పరిశీలిస్తే అసలు వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని స్థానికంగా చర్చ జరుగుతుంది. కొణిజర్ల, తల్లాడ తదితర మండలాల్లో ఇటీవల అధికారులు మిల్లులను తనిఖీ చేసి సిఎంఆర్‌కు సంబంధించిన వ్యవహారాలపై విచారణ చేపట్టారు. నిబంధనలకు విర్ధుదంగా వ్యవహరించినట్లు గుర్తించిన సందర్భాల్లో కేసులు కూడా నమోదయ్యాయి. అయితే వైరా మండలంలోని మిల్లుల విషయంలో అధికారులు పూర్తిస్థాయిలో తనిఖీలు నిర్వహించారా? మిల్లులకు కేటాయించిన ధాన్యం, మిల్లులో ఉన్న నిల్వలు, ప్రభుత్వానికి తిరిగి అందించిన సిఎంఆర్ బియ్యం వివరాలను సరిపోల్చారా? అన్న ప్రశ్నలు ఇప్పుడు వినిపిస్తున్నాయి.

**విచారణ జరగకముందే అంతా సక్రమమే ఎలా?**

వైరాలో సిఎంఆర్ ధాన్యానికి సంబంధించిన పెద్ద ఎత్తున ధాన్యం బయటకు తరలించారన్న ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణల్లో వాస్తవమెంత? అనేది అధికారిక విచారణ ద్వారానే తేలాల్సి ఉంది. ఇదిలా ఉండగా, అధికారికంగా పూర్తిస్థాయి విచారణ జరగకముందే కొందరు మిల్లర్లు తమకు ఎలాంటి ఇబ్బంది లేదని, తమ మిల్లులో ఎలాంటి తప్పు జరగలేదని ప్రచారం చేసుకుంటున్నారన్న చర్చ కూడా సాగుతుంది. అసలు అధికారులు తనిఖీ చేసి లెక్కలు తేల్చక ముందే ఇలాంటిధీమా ఎలా వచ్చిందన్న ప్రశ్నలు పలువురు మిల్లర్ల నుంచే వినిపిస్తున్నాయి. ఇటీవల జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో సిఎంఆర్ వ్యవహారంపై అధికారులు తనిఖీలు నిర్వహించిన సమయంలో వైరాలోని కొందరు మిల్లర్లలోను ఆందోళన నెలకొన్నట్లు స్థానికంగా ప్రచారం జరుగుతుంది. వైరా మండలంలోని ప్రతి మిల్లుకు ప్రభుత్వం కేటాయింన సిఎంఆర్ ధాన్యం ఎంత? దానికి అనుగుణంగా ప్రభుత్వం పొందాల్సిన బియ్యం ఎంత? ఇప్పటివరకు ఎంత బియ్యం అందింది? ఎంత బకాయి ఉంది? మిల్లుల్లో ప్రస్తుతం ఉన్న ధాన్యం, బియ్యం నిల్వలు ఎంత? రికార్డుల్లో ఉన్న వివరాలకు, భౌతిక నిల్వలకు తేడా ఉందా? ఈ అంశాలపై అధికారులు మిల్లుల వారీగా సమగ్ర తనిఖీలు నిర్వహించి లెక్కలు తేల్చాలని ప్రజలు కోరుతున్నారు.

# వారం రోజుల్లోనే గుండాలకు శాశ్వత వైద్యుడు



-ఇచ్చిన మాట నిలబెట్టుకున్నందుకు
పాయం చిత్రపటానికి పాలాభిషేకం

**ప్రజాపక్షం/గుండాల:**గుండాల మండలానికి 24గంటలూ అందుబాటులో ఉండే శాశ్వత వైద్యుడిని వారం రోజుల్లో కేటాయిస్తానన్న హామీని పినపాక ఎంఎల్‌ఎ, ఎస్టీ సంక్షేమ కమిటీ ఛైర్మన్ పాయం వెంకటేశ్వర్లు నిలబెట్టుకున్నారని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. మండల కేంద్రంలో గ్రంథాలయం ఏర్పాటు చేస్తున్నందుకు హర్షం వ్యక్తం చేస్తూ శనివారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఊకె బుచ్చయ్య ఆధ్వర్యంలో ఎంఎల్‌ఎ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి ఎస్‌కె ఖదీర్ మాట్లాడుతూ గతంలో గుండాల ఆసుపత్రిలో 108 వాహనం మరమ్మతులకు గురైన విషయాన్ని ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకెళ్లగానే, ఆయన డీఎంహెచ్‌వోతో మాట్లాడి కొత్త వాహనాన్ని నియమించడంతో పాటు గ్రంథాలయం ఏర్పాటు చేయడం గిరిజన ప్రాంత విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఉన్నత విద్య, ప్రభుత్వ ఉద్యోగాల సాధనకు సిద్ధమవుతున్న విద్యార్థులకు గ్రంథాలయం దోహదపడుతుందని పేర్కొన్నారు. మండల ప్రజల అవసరాలకు స్పందిస్తున్న ఎంఎల్‌ఎకు ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పొంబోయిన ముత్తయ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు గుర్రం పుష్పరాజ్, మండల నాయకులు వాంకుడోత్ బీకోజీ, బొర్రా వెంకటేశ్వర్లు, ఎస్‌కె అబ్దుల్ నభి, ఎస్‌కె కాసీం, సూర్నబాక కిషన్, గుండాల గ్రామ పంచాయితీ కాంగ్రెస్ అధ్యక్షుడు వాంకుడోత్ రమేష్, యువజన నాయకులు ఎస్‌కె ఇస్రార్, బొంగు చంద్రశేఖర్, అరేం నరసింహారావు, గడ్డం రాజేష్, వార్డు సభ్యుడు ఈసం చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

# కపాస్ కిసాన్ యాప్ ద్వారానే పత్తి కొనుగోళ్లు




**ప్రజాపక్షం/కారేపల్లి:** రైతుల నుంచి పత్తి కొనుగోళ్లను కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) రూపొందించిన కపాస్ కిసాన్ యాప్ ద్వారానే చేపట్టాలని జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఎ అలీమ్ తెలిపారు. ఇల్లందు మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో కారేపల్లిలోని ప్రియా కోటక్ జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేయనున్న సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. పత్తి నిల్వ గోదాములు, జిన్నింగ్ యంత్రాలను తనిఖీ చేసి, కేంద్రం వద్ద సహాయ కేంద్రం సూచికలను ఏర్పాటు చేయించారు. ఈసందర్భంగా అలీమ్ మాట్లాడుతూ రైతులకు కనీస మద్దతు ధర అందించేందుకు సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పత్తి క్వింటాకు ఏ గ్రేడ్‌కు రూ 8,667, సాధారణ రకానికి రూ 8,267 మద్దతు ధర చెల్లించనున్నట్లు తెలిపారు. పత్తిలో తేమశాతం 8,12శాతం మధ్య ఉండాలని, తేమ తగ్గేకొద్దీ ధర పెరుగుతుందని వివరించారు. వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేయాలనుకునే ప్రైవేట్ వ్యాపారుల మార్కెట్ కమిటీ నుంచి తప్పనిసరిగా లైసెన్స్ పొందాలని స్పష్టం చేశారు. లైసెన్స్ లేకుండా పంట ఉత్పత్తులు కొనుగోలు, నిల్వలు చేపడితే తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులు, పశువుల మార్కెట్ల చట్టం 1966 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లైసెన్స్ కోసం మార్కెట్ కమిటీ కార్యదర్శిని సంప్రదించాలని సూచించారు. సీసీఐకి పత్తి విక్రయించే రైతులు మరిన్ని వివరాలకు టోల్‌ఫ్రీ నంబర్ 18005995779,8897281111ను సంప్రదించాలని కోరారు.

## బతుకమ్మ వేడుకలకు మౌలిక సదుపాయాలు కల్పించాలి



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** గ్రామీణ ప్రాంతాల్లో బతుకమ్మ వేడుకలకు విద్యుత్ దీపాలు, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలు కల్పించాలని బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ కణితి రాముడు, కో కన్వీనర్ ఎండీ జానీ పాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంచాయితీలకు సకాలంలో నిధులు విడుదల కాక అభివృద్ధి పనులు, కనీస సౌకర్యాల కల్పనకు ఆటంకం ఏర్పడుతోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం బతుకమ్మ వేడుకలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించిందని, ప్రస్తుతం గ్రామాల్లో కనీస వసతులు కూడా కరవయ్యాయని విమర్శించారు. ఈకార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ బొల్లి వెంకటరావు, సర్పంచులు గుండి రవి, శీలం కమల, నాయకులు శీలం చలపతి, మడకం భూపతిరావు, యువజన కార్యదర్శి వాగే కృష్ణ, జిలకర గంగరాజు, జన్నూరి జయసింహ, పూసం దాస్, ఊడుగుల నీరీక్షణరావు, పాండ్ర రాంబాబు, యనబోయిన కోటేశ్వరరావు, తెల్లం సంజు, తెల్ల నాగరాజు, మడకం గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## పర్ణశాలలో విజయలక్ష్మీ అలంకారంలో మహాలక్ష్మీ



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** సీతారామచంద్రస్వామి అనుబంధ ఆలయమైన పర్ణశాల దేవస్థానంలో జరుగుతున్న శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శనివారం ఆరో రోజు మహాలక్ష్మీ అమ్మవారు విజయలక్ష్మీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకుని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## సమస్యలను తక్షణమే పరిష్కరించాలి



**ప్రజాపక్షం/గుండాల :** గుండాల మండలంలోని 11 గ్రామ పంచాయితీల్లో పేరుకుపోయిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండల వ్యాప్తంగా సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా బీఆర్‌ఎస్ మండల నాయకుడు గడ్డం వీరన్న మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎంఎల్‌ఎ రేగా కాంతారావు ఆదేశాల మేరకు వినతిపత్రాలు ఇచ్చినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామాల్లో కనీస సౌకర్యాలు కొరవడ్డాయని, పారిశుద్ధ్యం, అంతర్గత రహదారులు, మురుగునీటి కాలువల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని విమర్శించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రేగా కాంతారావు చొరవతో కోట్లాది రూపాయల నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేపట్టామని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. గుండాలతో పాటు సాయనపల్లి, దామరతోగు, రోళ్లగడ్డ, లింగగూడెం గ్రామ పంచాయితీల్లో వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ తాటి పాపారావు, నాయకులు తిరుక వల్లూరి రాము, గడ్డం రమేష్, పొంబోయిన సుధాకర్, డబ్బా గిరిబాబు, మొక్క ప్రశాంత్, గంగాధరి నాగన్న, గడ్డం రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా వేణుమాధవ్‌రావు



**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండలం బాజుమల్లాయిగూడెం జెడ్‌పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణుమాధవరావు పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా శనివారం ఎన్నికయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వం ద్వారా వారికి అందాల్సిన ప్రయోజనాలు సాధించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

## బ్రెయిన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న బాలుడి కల నెరవేర్చిన కేటీఆర్

-వినయ్‌ను ఆప్యాయంగా పలకరించి వైద్యసాయానికి హామీ



**ప్రజాపక్షం/కూసుమంచి:** బ్రెయిన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న 13 ఏళ్ల బాలుడి వినయ్ తన అభిమాన నాయకుడు, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి ఫోటో దిగాలన్న కోరిక నెరవేరింది. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నరసింహులగూడెం గ్రామానికి చెందిన కర్నె ఆదినారాయణ, అనిత దంపతుల కుమారుడైన వినయ్ కోరికను కుటుంబ సభ్యులు పాలేరు మాజీ ఎంఎల్‌ఎ కందాళ ఉపేందర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో హైదరాబాద్‌లోని కందాళ ఉపేందర్‌రెడ్డి నివాసంలో కేటీఆర్ బాలుడు వినయ్‌ను కలిశారు. ఆప్యాయంగా పలకరించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అవసరమైన వైద్య సాయం అందించేందుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. తన అభిమాన నాయకుడిని కలుసుకుని ఫోటో దిగాలన్న కోరిక నెరవేరడంతో వినయ్, అతని కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ అవకాశం కల్పించిన కేటీఆర్, కందాళ ఉపేందర్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## పెరిక సింగారంలో భారీ కుంకుమ పూజ

**ప్రజాపక్షం/కూసుమంచి:** దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కూసుమంచి మండలం పెరిక సింగారం గ్రామంలో శనివారం భారీ కుంకుమ పూజ, మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సతీమణి పొంగులేటి మాధురి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈకార్యక్రమంలో ఆహ్వానితులు జూకూరి గోపాల్‌రావు, విజయలక్ష్మి దంపతులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వ్యవసాయ మోటార్ల దొంగల ముఠా గుట్టురట్టు



## నలుగురు అరెస్ట్, రూ. 2.80 లక్షల సొత్తు స్వాధీనం

ప్రజాపక్షం/పెనుబల్లి: వ్యవసాయ పొలాల్లో విద్యుత్ మోటార్లు, కేబుల్ వైర్ల దొంగతనాలకు పాల్పడుతున్న ఏడుగురు సభ్యుల ముఠాను వి.ఎం. బంజర్ పోలీసులు చాకచక్యంగా అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సత్తుపల్లి రూరల్ సీఐ సర్వయ్య, సబ్‌ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎస్.కె. షాకీర్ శనివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం... వి.ఎం. బంజర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు వ్యవసాయ పొలాల్లో వరుసగా మోటార్లు, వైర్లు దొంగతనానికి గురవుతుండటంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా క్రైమ్ నంబర్లు 196/2026, 197/2026, 198/2026, 199/2026, మరియు 200/2026 కింద మొత్తం ఐదు కేసులను సత్వరమే ఛేదించారు.

### అరెస్ట్ అయిన నిందితులు..

ఈ దొంగతనాలకు సంబంధించి గణేష్‌పాడు గ్రామానికి చెందిన పవన్ కళ్యాణ్, కళ్ళం జగన్, రావూరి నాగేశ్వరరావు; తిరువూరు మండలం కోకిలంపాడుకు చెందిన జొన్నలగడ్డ నాగరాజు, పాత కారాయిగూడెంకు చెందిన ఎస్.కె. రఫీ; ముత్తగూడెంకు చెందిన రావూరి సల్మాన్, పెనుగొల్లికి చెందిన రావూరి లక్ష్మణరావులను పోలీసులు అరెస్ట్ చేశారు.

### రూ. 2,80,000 విలువైన సొత్తు స్వాధీనం...

నిందితుల వద్ద నుంచి సుమారు 2,80,000 (రెండు లక్షల ఎనభై వేల రూపాయలు) విలువ చేసే 7 విద్యుత్ మోటార్లు, 200 మీటర్ల కేబుల్ వైర్ మరియు ఒక మోటార్ బాక్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం ముఠా ఏడుగురు కాగా నలుగురిని గుర్తించి న్యాయస్థానంలో హాజరు పరిచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ, ఎస్ఐ తెలిపారు. విద్యుత్ మోటార్ల దొంగతనాల గుట్టును రట్టు ను చేధించి నిందితులను అదుపులోకి తీసుకున్నందుకు ఖమ్మం సిపి, కల్లూరు ఏసిపి వియం. బంజర్ పోలీస్ సిబ్బందిని అభినందించారు.

### రైతులకు పోలీసుల సూచనలు...

వ్యవసాయ పరికరాల దొంగతనాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఎస్.కె. షకీర్ హెచ్చరించారు. రైతులు తమ పొలాల వద్ద ఉన్న పరికరాలకు తగిన భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలని, గ్రామాలు లేదా పొలాల వద్ద అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. ప్రజల ఆస్తుల పరిరక్షణకు వి.ఎం. బంజర్ పోలీసులు నిరంతరం అందుబాటులో ఉంటారని స్పష్టం చేశారు.

# వేణుగోపాల్ కుటుంబానికి సిపిఐ నేతల పరామర్శ



ప్రజాపక్షం/ ఖమ్మం : టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర నాయకులు, నమస్తే తెలంగాణ బ్యూరో చీఫ్ మాటేటి వేణుగోపాల్ కుటుంబాన్ని శనివారం సిపిఐ నేతలు పరామర్శించారు. ఇటీవల వేణుగోపాల్ తండ్రి మాటేటి శ్రీరాంరావు మరణించిన విషయం విధితమే. శ్రీరాంరావు చిత్ర పటానికి సిపిఐ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు శ్రీరాంరావు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళుర్పించిన వారిలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా సహయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, నాయకులు తోట రామాంజనేయులు, గాదె లక్ష్మి నారాయణ ఉన్నారు.

# వైరా గ్రీన్‌ఫీల్డ్ హైవే వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

## బొలేరోను ఢీకొట్టిన లారీ

## ఇద్దరు మృతి...మరో ఏడుగురికి గాయాలు





ప్రజాపక్షం/వైరా: ఖమ్మం జిల్లా వైరా మండలం సోమవరం గ్రామ సమీపంలోని గ్రీన్‌ఫీల్డ్ హైవే ఎగ్జిట్ వద్ద అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బొలేరో వాహనాన్ని వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఏడుగురు గాయప డ్డారు. వివరాల్లోకి వెళితే దేవరపల్లి నుంచి భువనగురి వైపు బొలెరో వాహనంలో ప్రయాణిస్తున్న సమయంలో సోమవరం గ్రామ సమీపంలోని గ్రీన్‌ఫీల్డ్ హైవే ఎగ్జిట్ వెనుక నుంచి వచ్చిన లారీ బొలెరోను ఢీకొట్టింది. ఈ ఘటనలో బొలేరో వాహనం పల్టీకొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న మల్లేష్, ఉపేందర్ అనే ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఏడుగురికి గాయాలయ్యాయి. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై వైరా ఎస్సైరామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మంత్రి ఆశయానికి అనుగుణంగా ఏదులాపురం మున్సిపాలిటీ అభివృద్ధి



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ఏదులాపురంమున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దే లక్ష్యంతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత అన్నారు. శనివారం ఏదులాపురం మున్సిపాలిటీలోని నాయుడుపేట, కోదాద, వెంకటగిరి క్రాస్‌రోడ్స్‌లో ఏర్పాటు చేస్తున్న సుందరీకరణ పనులను కమీషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని సమీక్షించి, అభివృద్ధి కార్యక్రమాలు, న్యాతా ప్రమాణాలతో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... మున్సిపాలిటీపరిధిలో ప్రజలకు మెరుగైన మౌళిక వసతులు కల్పించడం, పరిశుభ్రమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయడం, ప్రధాన కూడళ్లను సుందరంగా తీర్చిదిద్దడం ద్వారా పట్టణానికి కొత్త రూపు తీసుకురావడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. మంత్రి క్యాంప్ కార్యాలయ ఇంచార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి మార్గదర్శకత్వంలో ప్రజలకు అవసరమైన మౌళిక సదుపాయాలను మెరుగుపరుస్తూ అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మారబోతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఏఈ అప్పారావు, కాంగ్రెస్ కౌన్సిలర్లు సోము వెంకట్ రెడ్డి, బుర్ర మహేష్, కడవ నవీన్, బానోత్ ప్రసాద్ పాల్గొన్నారు.

# సాగునీటి కష్టాలపై అధికారుల స్పందన



ప్రజాపక్షం/వేంసూరు: మండల రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యలపై అధికారులు స్పందించారు. సాగునీటి పంపిణీలో అక్రమ వసూళ్లు, పక్షపాత ధోరణిపై రైతు జాబిశెట్టి కోటేశ్వరరావు వ్యక్తం చేసిన ఆవేదనపై స్పందించిన అధికారులు క్షేత్రస్థాయిలో రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. లిఫ్ట్ కెనాల్ 1, 2 కమిటీలపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో వాటిని రద్దు చేయాలని సంబంధిత ఇరిగేషన్ డీఈని ఆదేశించారు. ఆరోపణలపై పూర్తిస్థాయి విచారణ జరిపి నివేదిక సమర్పించాలని, పంటలు ఎండిపోకుండా ప్రతి ఎకరాకు నిష్పక్షపాతంగా సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అధికారుల స్పందనపై వేంసూరు మండల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ



## మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చంద్రావతి

ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ 19వ వార్డు పరిధిలోని లాలాపురం గ్రామంలో శ్రీకోదండ రామాలయం వద్ద నిర్వహించిన బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో వైరా మాజీ ఎమ్మెల్యే బానోతు చంద్రావతి దామా ఉమా వెంకటేశ్వర్లుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రావతి మహిళలతో కలిసి బతుకమ్మ కోలాట నృత్యాల్లో ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. మహిళలతో ఆప్యాయంగా మమేకమై వేడుకలకు మరింత కళ తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బానోతు చంద్రావతి మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడచుల ఆత్మగౌరవానికి మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక . ప్రకృతిని పూజిస్తూ పూలను కొలుస్తూ మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఈ పండుగ మనందరిలో ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందిస్తుంది. తరతరాలుగా వస్తున్న మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. మహిళలు ఆనందోత్సాహాలతో కలిసి బతుకమ్మ వేడుకలు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే బతుకమ్మ పండుగ ప్రతి ఇంటా సంతోషాలు, సౌభాగ్యాలు నింపాలని కోరుకుంటున్నాను అని అన్నారు. ఈ వేడుకల్లో దామా ఉమా, దామా లక్ష్మీ , దామా సుజాత, దామా సౌజన్య, దామా రమాదేవి, దామా లావణ్య, లేఖన, నిత్యశ్రీ, పాసంగులపాటి శారద, జ్యోతి, కట్ల జ్యోతి, కవిత, సయ్యద్ తారా, షేక్ రజియా, మున్నీ, బి.సత్యావతి, సపావత్ రాధమ్మ, నల్లబోలు భారతమ్మ, త్రివేణి, కూరాకుల లక్ష్మీ , ఇమ్మడి అనురాధ, సయ్యద్ షాహినా, కొమ్ము తిరుమలి, మోదుగు సామ్రాజ్యం, సయ్యద్ సఫియా, సోని, పరిజానా, వరాలు నిర్మల తదితత మహిళలు పాల్గొన్నారు.

# పత్తి ఉత్పాదకత కోసం మిషన్



ప్రజాపక్షం/మధిర: మధిర మండలం రాయపట్నం గ్రామంలో జాతీయ పత్తి ఉత్పాదకత మిషన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సాయి దీక్షిత్ రైతులకు పత్తి పంటలో ఆధునిక సాగు పద్ధతులు, ఉత్పాదకత పెంపు, సమగ్ర సస్య రక్షణ, యాసంగి పంటల సాగుకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. అధిక సాంద్రత పత్తి విధానంలో పత్తిని 90X15 సెంటీమీటర్ల దూరంతో సాగు చేయడం ద్వారా నిర్ణీత విస్తీర్ణంలో మొక్కల సంఖ్యను పెంచవచ్చని మ ండల వ్యవసాయ అధికారి వివరించారు. మొక్కల ఎత్తు, పెరుగుదలను నియంత్రించేందుకు పం ట దశను బట్టి 40, 60 రోజుల సమయంలో వ్యవసాయశాఖ సిఫార్సుల మేరకు వృద్ధి నియంత్రకాల వినియోగం గురించి వివరించారు. రైతులు తమ భూములు స్వభావం, అందుబాటులో ఉన్న నీటి వనరులు, స్థానిక వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని శనగ, పెసర, మినుము వంటి తక్కువ నీటి అవసరం ఉన్న పంటలను అనుకూలతలను బట్టి సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గోపి, ఆత్మ డైరెక్టర్ గోపాలరావు, మండల వ్యవసాయ అధికారి సాయిదీక్షిత్, వ్యవసాయ విస్తరణ అధికారి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# విద్యా వ్యతిరేక విధానాలపై టిఎస్ యుటిఎఫ్ పోరుబాట



ప్రజాపక్షం/మధిర: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద గల ధర్నా చౌక్‌లో జరగనున్న ఉపాధ్యాయుల సామూహిక నిరహార దీక్షలో పాల్గొనుటకు తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కమిటీ సభ్యులు లంకా నాగేశ్వరరావు, ఎర్రుపాలెం మండల ఉపాధ్యక్షులు నీలం సైదారావు, ఆడిటర్ వెంకటకృష్ణ, డివిజన్ నాయకులు పోతినేని రాజేష్, మొండ్రు సుధాకర్‌లు తరలినట్లు టిఎస్ యుటిఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శులు షేక్ నాగూర్‌వలి, అనుమోలు కోటేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పిలుపు మేరకు టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం జరగనున్నట్లు తెలిపారు. విద్యాహక్కు చట్టం అమలుకు ముందు నియమితులైన ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు తప్పనిసరి టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, జాతీయ విద్యా విధానం 2020ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. జాతీయ పెన్షన్ పథకాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించాలని ప్రాథమిక పాఠశాలలకు నష్టం కలిగించే జీవో నెంబర్ 25ను సవరించాలని కోరారు. వేతన సవరణ కమీషన్ నివేదికను తెప్పించు కొని, దాని సిఫార్సులను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఉపాధ్యాయ సంఘాలు చేపడుతున్న ఉద్యమం లో భాగంగా ఈ సామూహిక నిరహారదీక్ష జరగనుందని తెలిపారు.

# యువకుడి ఆత్మహత్య

ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : తల్లి మరణంతో మానసికంగా కుంగిపోయిన ఓ యువకుడు ఊరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన ఖమ్మం నగరంలోని రమణగుట్ట ప్రాంతంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం రమణగుట్టకు చెందిన పెంట లక్ష్మయ్య, పుల్లమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఇటీవల అనారోగ్యంతో లక్ష్మయ్య భార్య మృతిచెందింది. అప్పటి నుంచి లక్ష్మయ్య చిన్న కుమారుడు పెంట సాయి (23) తల్లి జ్ఞాపకాలతో తరచూ బాధపడుతూ మానసికంగా కుంగిపోయేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఇదిలా ఉండగా శుక్రవారం రాత్రి అందరూ భోజనం చేసి నిద్రకు ఉపక్రమించారు. రోజువారిలా శనివారం ఉదయం లక్ష్మయ్య లేచి చూసే సరికి ముందు గదిలో రేకుల రాడ్‌కు చున్నీతో ఊరివేసుకుని కనిపించడంతో వెంటనే కుటుంబ సభ్యులు కిందకి దించి అతడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పెయింటర్‌గా పనిచేసే తనకుమారుడు సాయి తల్లిమరణంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు తండ్రి లక్ష్మయ్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పెర్కొన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ రామకృష్ణ తెలిపారు.

# తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే పండుగ బతుకమ్మ

**- కలెక్టర్ అంకిత్**
**- ఐడిఓసిలో అంబురాన్ని అంటిన సంబురాలు**





**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే పండుగ బతుకమ్మ అని కలెక్టర్ అంకిత్ అన్నారు. శనివారం ఐడిఓసి కార్యాలయంలో గ్రామీణాభివృద్ధి శాఖ, మహిళా శిశు సంక్షేమశాఖ పంచాయితీ, మున్సిపాలిటీ ఎంపిడిఓలు, ఎంపిఓలు మెప్మా తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. ఈసందర్భంగా ఐడిఓసిలో వివిధ రంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉద్యోగులు బతుకమ్మ ఆట పాటలు పాడుతూ కోలాట నృత్యాలతో సందడి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతి పూలు మహిళలను గౌరవించే గొప్ప పండుగ బతుకమ్మ అన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇటువంటి పండుగలు కీలకపాత్ర పోషిస్తాయని చెప్పారు. ఈ వేడుకను సాంప్రదాయబద్ధంగా చూడముచ్చడగా నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం జిల్లా ప్రజలందరికీ కలెక్టర్ బతుకమ్మ దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా శుభసంతోషాలు, ఆయురారోగ్యాలతో తులతూగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాలరావు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి జిల్లా పంచాయితీ అధికారి అనూష మహిళా శిశుసంక్షేమ అధికారి స్వర్ణలత లెనీనా, టిఎన్‌జిఓస్ జిల్లా అధ్యక్షులు వెంకటపుల్లయ్య వివిధ శాఖల అధికారులు ఉద్యోగులు మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

**ఐటిడిఏలో :** బతుకమ్మ సంబురాలు ఐటిడిఏ ఆవరణలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఉద్యోగులతో పాటు ఐటిడిఏ పిఓ దంపతులు సైతం పాల్గొని ఆడపడుచులతో కలిసి బతుకమ్మ సంబురాల్లో ఆడిపాడారు. ఆ సందర్భంగా పిఓ కార్యాలయం పూల పండుగతో పులకించింది. రంగురంగుల పూలు ప్రత్యేక శోభను తీసుకొచ్చింది. సాంప్రదాయ వస్త్రాలతో ఉద్యోగులు మహిళలు హాజరైన ఉత్సాహపూరితంగా గడిపారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ మహిళల ఆత్మీయతకు ఐఖ్యతకు ఈ వేడుక ప్రతీకని పిఓ అభివర్ణించారు.

# శేషగిరి నగర్‌లో రూ.15 లక్షల అభివృద్ధి పనులు ప్రారంభం

**మినీ ఫంక్షన్ హాల్, సీసీ రోడ్డును ప్రారంభించిన పినపాక ఎమ్మెల్యే పాయం**



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని శేషగిరి నగర్‌లో హనుమాన్ టెంపుల్ వద్ద నూతనంగా నిర్మించిన అభివృద్ధి పనులను పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. స్థానిక ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో మొత్తం రూ.15 లక్షల వ్యయంతో చేపట్టిన ఈ పనుల్లో రూ.10 లక్షలతో నిర్మించిన మినీ ఫంక్షన్ హాల్‌ను, రూ.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మినీ ఫంక్షన్ హాల్‌శేషగిరి నగర్ ప్రజలు వివాహాలు, శుభకార్యాలు, ఇతర సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు మినీ ఫంక్షన్ హాల్ ఎంతో ఉపయోగపడనుంది. స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది.

**మెరుగుపడనున్న రవాణా సౌకర్యాలు...**

అదే విధంగా రూ.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభంతో స్థానిక ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. కాలనీల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ( ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులు, టౌన్ అధ్యక్షులు కురం రవి ముదిరాజ్, జిల్లా ముఖ్య నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వైరాలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ, ఆరోగ్య శిబిరం

**క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించాలి: కట్టా కృష్ణార్జునరావు**



**ప్రజాపక్షం/వైరా:** గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలనుఅ ందించడంతో పాటు క్యాన్సర్‌పై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో వైరాలోని కమ్మవారి కళ్యాణ మండపంలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. కమ్మజన సేవా సమితి, కాకతీయ కమ్యూనిటీ ఫౌండేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో బసవతారకం ఇండో అమెరికయన్ క్యాన్సన్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని కాకతీయ కమ్యూనిటీ ఫౌండేషన్ చైర్మన్ గూడూరి సత్యనారాయణ, కమ్మజన సేవా సమితి అధ్యక్షుడు కట్టా కృష్ణార్జునరావు మాట్లాడుతూ క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించడం ద్వారా బాధితులకు సకాలంలో వైద్యసేవలు అందించి చికిత్సను మరింత సమర్థవంతంగా అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. క్యాన్సర్ లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా శరీరంలో అసాధారణ మార్పులు కనిపించినప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంలో భాగంగా ఇటువంటి ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. స్థానిక ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరానికి వందలాది మంది ప్రజలు హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, వైరా మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, మురళీకృష్ణ, కమ్మజన సేవా సమితి సభ్యులు చింతనిప్పు రాంబాబు, మెదరమెట్ల శ్రీనివాసరావు, చావా శ్రీనివాసరావు, సూర్యదేవర శ్రీధర్, వాసిరెడ్డి రమేష్, ఏనుగు హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. వైద్యసిబ్బంది శిబిరంలో సేవలందించారు.

# కోట మైసమ్మ తల్లిని దర్శించుకున్న పిడమర్తి



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ కోటమైసమ్మ తల్లి ఆలయంలో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా ఏడవ రోజు అమ్మవారు అన్నపూర్ణ దేవి అవతారంలో శనివారం భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సతీష్‌శర్మ ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మాజీ ఎస్సి కార్పోరేషన్ ఛైర్మన్ పిడమర్తి రవి ఆలయానికి విచ్చేసి కోట మైసమ్మతల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. దేవీ నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ లగడపాటి నెహ్రూ మాధవి దంపతులు, మాజీ ఎంపిపి సరికొండ లక్ష్మి పద్మావతి కుమారుడు లోకేష్ రాజు, భక్తులు పాల్గొన్నారు.

# హక్కుల సాధన కోసం ఐక్య పోరాటాలు

**ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ సలాం**




**ప్రజాపక్షం/వైరా:** ముస్లీం మైనార్టీల హక్కుల సాధన కోసం పార్టీలకు అతీతంగా ఐక్యంగా పోరాడాలని తంజిమ్ ఏ ఇన్సాఫ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ సలాం పిలుపునిచ్చారు. శనివారం వైరాలోని సిపిఐ కార్యలయ ంలో ఇన్సాఫ్ వైరా మండల కార్యదర్శి షేక్ షరీఫ్ అధ్యక్షతన నిర్వహించిన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్య, ఉపాధి, మైనార్టీ సంక్షేమం, రిజర్వేషన్లు విషయంలో ముస్లీంలకు న్యాయం జరగాలని, వక్ఫ్ భూములు, ఇనాం భూములు, ఈద్గాలు, స్మశానవాటికల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. మైనార్టీలు తమ హక్కుల కోసం గొంతెత్తి, ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ వైరా మండల కార్యదర్శి యామాల గోపాలరావు, షేక్ రహీం, మూట కొండ, రామకృష్ణ, షేక్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు. ఇన్సాఫ్ వైరా మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా షేక్ ఇబ్రహీం, కార్యదర్శిగా షేక్ జాని, కోశాధికారిగా షేక్ యాకూబ్అలీ, ఉపాధ్యక్షుడిగా షేక్ సుభాని ఎన్నికయ్యారు.

# గిరిజన విద్యార్థినికి ఐటిడిఏ ఆర్థికసాయం



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఎంబిబిఎస్‌లో సీటు సాధించిన గిరిజన విద్యార్థినీకి ఐటిడిఏ పిఓ ఆర్థిక సహాయాన్ని అందచేశారు. కార్తీక అనే గిరిజన విద్యార్థిని తన చదువుల కోసం ఆర్థికంగా సహకరించాలంటూ చేసిన విజ్ఞప్తి మేరకు స్పందించిన పిఓ రూ.50 వేల చెక్కును ఆమె తల్లి సమక్ష్యంలో అందజేశారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు ఉన్నత చదువుల్లో రాణించి తమ లక్ష్యాలను సాధించాలని, అవసరమైన ప్రోత్సాహాన్ని అందించేందుకు గిరిజన సంక్షేమ శాఖ ముందుంటుందని తెలిపారు.

# పేద విద్యార్థులకు ఉపకార వేతన చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/మణుగూరు:** పేద విద్యార్థులను ప్రోత్సహించి, వారి ఉన్నత విద్యకు ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ కమ్మవారి సేవా సంఘాల సమాఖ్య సహకారంతో మణుగూరు కమ్మ మహాజన సేవా సంఘం ఆధ్వర్యంలో కమ్మ సామాజిక వర్గానికి చెందిన పేద విద్యార్థులకు ఉపకార వేతన చెక్కులను పంపిణీ చేశారు. ఆర్థిక ఇబ్బందులు విద్యార్థుల విద్యాభ్యాసానికి ఆటంకం కాకూడదనే సదుద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతిభ ఉన్నప్పటికీ ఆర్థిక పరిస్థితులు అనుకూలించక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు ఎంతో తోడ్పాటునందిస్తాయని సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. విద్య అనేది వ్యక్తిగత అభివృద్ధికే కాకుండా కుటుంబ, సామాజిక అభ్యున్నతికి కూడా పునాది అని, ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని పట్టుదలతో చదువుకోవాలని వారు సూచించారు. విద్యార్థులు మాట్లాడుతూ తమ విద్యకోసం ఆర్థికంగా ప్రోత్సహిస్తున్న సంఘ సభ్యులకు రాష్ట్ర కమిటి సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉన్నత చదువులు చదివి భవిష్యత్తులో ఆదర్శం గా నిలుస్తామన్నారు.ఈ కార్యక్రమంలో కమ్మ మహాజన సేవా సంఘం అధ్యక్షులు ఉప్పలపాటి వెంకటరాంబాబు, ప్రధాన కార్యదర్శి తోటకూరి సతిష్ కుమార్, కోశాధికారి మానుకొండ ఉమాకర్, దండా రాధాకృష్ణ ,పుచ్చకాయల శంకర్, పొశం భాస్కర్, యలమాటి పూర్ణ, కరివేద వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కరువు మండలాల జాబితాలో ఏన్కూరు, కొణిజర్ల, వైరా మండలాలను చేర్చాలి



**ప్రజాపక్షం/వైరా:** జిల్లా అధికార యంత్రాంగం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో ఏన్కూరు, కొణిజర్ల, వైరా మండలాలను చేర్చాలని సిపిఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైరా నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించి, రైతులు, పేదల సమస్యలను పరిష్కరించాలని కోరారు. శనివారం వైరాలోని సిపిఎం డివిజన్ కార్యాలయం బోడేపూడి భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేవంలో భూక్యా వీరభద్రం, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ, సుంకర సుధాకర్, సిపిఎం కొణిజర్ల మండల కార్యదర్శి చెరుకుపల్లి కుటుంబరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెనుకబడిన ఏజెన్సీ మండలమైన ఏన్కూరుతో పాటు కొణిజర్ల, వైరా మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రభుత్వం తక్షణమే స్పందించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు.

# సమస్యలను పరిష్కరించండి




**ప్రజాపక్షం/మణుగూరు:** బీఆర్ఎస్ పార్టీ పినపాక నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పార్టీ మాజీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు ఆదేశాల మేరకు మణుగూరు రామానుజరం పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య పనులు, పంచాయతీ పరిధిలో స్థానిక సమస్యల పరిష్కారంకై పంచాయతీ కార్యదర్శి కి మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు లేళ్ల, కృష్ణ మండల నాయకులు తడకమళ్ళ, ప్రభుదాస్, అక్కి, నరసింహారావు, బిఆర్ఎస్ పార్టీ వార్డ్ నెంబర్స్ నడిగొప్పుల సిద్దు, మండారి ఎబినేజర్, పార్టీ నాయకులు జక్కుల వీరయ్య, బట్ట వెంకటేశ్వర్లు, యువజన నాయకులు మండారి, సతీష్, బోయిళ్ళ రాజు, శ్రీరామ్ మూర్తి, చింటూ, ప్రభాకర్, సతీష్, చిన్న కృష్ణ గోపాల్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# ఐక్యతతోనే బలోపేతం



(మొదటిపేజీ తరువాయి)

సందర్భంలో పోరాటమే మార్గమని ఆయన తెలిపారు.

**కమ్యూనిస్టుల సిద్ధాంతాల వైపు యువత : తమ్మినేని**



కమ్యూనిస్టుల సిద్ధాంతాల వైపు యువత ఆలోచిస్తున్నారని కమ్యూనిస్టుల డిమాండ్లు ఇప్పుడు జన్‌జీ డిమాండ్లుగా మారుతున్నాయని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం తెలిపారు. భారత దేశంలో ఇప్పుడు యువత డిమాండ్లు ముఖ్యంగా ఎన్నికల కమిషనర్ రాజీనామా, అంతకు ముందు నీట్ లీకేజీపై మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్ కూడా కమ్యూనిస్టుల నుంచి వచ్చిందేనన్నారు. దేశంలో ప్రజాస్వామ్య మనుగడపై చర్చ జరుగుతున్న వేళ యువత కమ్యూనిస్టు సిద్ధాంతాల వైపు ఆసక్తి చూపుతున్నారని తమ్మినేని తెలిపారు. ఈ దేశంలో లౌకిక, ప్రజాస్వామ్య పరిరక్షణ కమ్యూనిస్టులతోనే సాధ్యమని ఆయన తెలిపారు.

**కీలక భూమిక పోషించిన కర్నాటి : పోటు రంగారావు**



తెలంగాణ సాయుధ పోరాటంతో పాటు ఆనాటి ఆంధ్ర మహాసభ ఆందోళనలోనూ కర్నాటి కృష్ణయ్య కీలక పాత్ర పోషించారని సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. సాయుధ పోరాటంలో అనేక చిరస్మరణీయ ఘట్టాలు ఉన్నాయని ఎందరో యోధులు ఈ పోరాటంలో పాల్గొని నిజాంను గద్దె దింపేందుకు అనన్య త్యాగాలు చేశారన్నారు. అటువంటి వారిలో కర్నాటి కృష్ణయ్య ఒకరని రంగారావు తెలిపారు. నాటి ప్రజా ఉద్యమాలను నేటి తరం స్ఫూర్తిగా తీసుకుని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ సభలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కర్నాటి భానుప్రసాద్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బత్తినేని నీరజ, ఏపూరి లతాదేవి, మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి సివై పుల్లయ్య, సిపిఐ జిల్లా నాయకులు కనకబండి సీతారాములు, సిపిఐ మండల కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్, వివిధ పార్టీల నాయకులు రామారావు, గుడవర్తి నాగేశ్వరరావు, కెవి రెడ్డి, పగిడికత్తుల రాందాస్ పాల్గొన్నారు.

# అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాల్సిందే..

**-బాండ్ల పరిశీలనకు పది కేంద్రాలు ఏర్పాటు చేయండి**
**-బాధితుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు పశ్య పద్మ**






**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలంగాణ రాష్ట్రంలో అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాల్సిందేనని అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు పశ్య పద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ బాధితులకు సంబంధించి బాండ్ల పరిశీలనకు పది కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆమె కోరారు. అగ్రి గోల్డ్ బాధితుల సమావేశం శనివారం స్థానిక గిరిప్రసాద్ భవన్ జరిగింది. గుడిమెట్ల రజిత అధ్యక్షతన జరిగిన సమావేశంలో పశ్య పద్మ మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితుల పక్షాన 12 ఏళ్లుగా పోరాడుతున్నామని అయినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. బాండ్ల పరిశీలనకు కేంద్రాల సంఖ్యను పెంచాలని ప్రస్తుతం కేవలం మూడు కేంద్రాలు మాత్రమే ఉన్నాయని ఆ సంఖ్యను పదికి పెంచి త్వరితగతిన బాండ్ల పరిశీలనను పూర్తి చేయాలని పద్మ కోరారు. అగ్రిగోల్డ్ బాధితులు ప్రభుత్వంపై పోరాడేందుకు సిద్ధం కావాలని సమస్య పరిష్కారం అయ్యేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు. న్యాయస్థానం పర్యవేక్షణలో అగ్రిగోల్డ్ భూములకు వేలం నిర్వహించాలని ఆమె డిమాండ్ చేశారు. చిన్న చిన్న కమతాలుగా భూమిని విడగొట్టి వేలం వేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. ఇప్పటికే పక్క రాష్ట్రంలో అమలవుతున్నందున ఇక్కడ కూడా అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

**నూతన కమిటీ ఎన్నిక :**

అగ్రిగోల్డ్ నూతన కమిటీ జిల్లా అధ్యక్షులుగా యర్రా బాబు, కార్యదర్శిగా గుడిమెట్ల రజిత, సహాయ కార్యదర్శులుగా చింతల రమేష్, బోడ్డు నరేందర్, పివిఎస్‌వి రాజు, ఉపాధ్యక్షులుగా పుష్ప, లక్ష్మి , సునీత, కోశాధికారిగా లక్ష్మి నారాయణ లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోగుల వెంకటేశ్వర్లు, మైలవరపు లక్ష్మి , విరజ, మధుసూదన్‌రావు, దుర్గారావు పాల్గొన్నారు.

# వైద్యం అందక ఇబ్బందులు పడుతున్న పెన్షనర్లు

**-ఎస్‌జిపిఏటి నేత పరిశ పుల్లయ్య**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** హెల్త్ కార్డులు రాక, వైద్యం అందక పింఛన్‌దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య తెలిపారు. ఐదు నెలలుగా పింఛన్‌దారులు ఉద్యోగుల వేతనాల నుండి హెల్త్ స్కీంకు సంబంధించిన ప్రీమియంను ప్రతి నెల తీసుకుంటున్న ప్రభుత్వం హెల్త్ కార్డులను అందజేయడంలో మాత్రం తీవ్ర జాప్యం చేస్తుందని పుల్లయ్య ఆరోపించారు. హెల్త్ కార్డుల్లో సవరణ, మార్పులు, తొలగింపుల ఆప్షన్ ఇస్తే వేలాది మంది పింఛన్‌దారులకు హెల్త్‌కార్డులు వస్తాయని ఆ సౌకర్యం కల్పించడానికి ప్రభుత్వం అలసత్వం వహిస్తుందని ఆయన తెలిపారు. 2024 తర్వాత ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్లకు ప్రతి నెల డిఆర్ బిల్లులు ఉద్యోగ విరమణ చేసిన చోటే చేయించడం కష్టతరం అవుతుందని బిల్లులు ట్రెజరీలో చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని పెన్షనర్ల కోసం ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. పెన్షనర్ల కోసం భవనాలు నిర్మించాలని డిసెంబర్ 17 పెన్షనర్ల దినోత్సవాన్ని ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. పెన్షనర్లు ఉద్యమాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి మేరీఏసుపాదం, జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్, నాయకులు కనపర్తి వెంకటేశ్వర్లు, పెదమాళ్ల సత్యనారాయణ, కొల్లికొండ శరత్ బాబు, వెంకటేశ్వర్లు, కె. శ్యాంసుందర్, అంజలి, కృష్ణకుమారి, కనపర్తి నాగప్రసాద్, సుధాకర్, రాధాకృష్ణమూర్తి, హుస్సేన్, సుధాకర్ పాల్గొన్నారు.

# అన్నారుగూడెంలో మహా అన్నదానం



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో రామాలయం వద్ద గురుస్వామి గోవిందు శ్రీనివాసరావు, గోవిందు సురేష్ ల ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాముల ఇరుముడి సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రియల్ మాజీ ఛైర్మన్ మువ్వా విజయ బాబు శనివారం ప్రారంభించారు. తొలుత ఆయనకు సీనియర్ నాయకులు, గ్రామ ఉప సర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వర్లు స్వాగతం పలికారు. గ్రామ సర్పంచ్ గొర్ల ప్రభాకర్, ఉప సర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వర్లు, మాజీ ఎంపిపి దొడ్డ శ్రీనివాసరావులను ఆయన శాలువతో సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కూచిపూడి వెంకటేశ్వరరావు, పొన్నం కృష్ణయ్య, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ యాకూబ్ పాషా, నర్సింహారావు, ఆదినారాయణ, నారాయణ, దానయ్య, హరీష్ పాల్గొన్నారు.

# బాధితునికి పరిహారం చెల్లించండి

**-వినియోగదారుల ఫోరం తీర్పు**

**ప్రజాపక్షం/ ఖమ్మం లీగల్ :** బీమా పథకం పాలసీలో అనారోగ్య బాధితునికి వైద్య ఖర్చులు చెల్లించాలని ఖమ్మం జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ఛైర్మన్ జే. శామ్యూల్, సభ్యులు వి. లలిత, ఎ. మాధవిలత లు తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళితే... బోనకల్ మండలం రాపల్లి గ్రామానికి చెందిన తోట రామాంజనేయులు కెర్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలో ఆరోగ్య బీమా పథకం పాలసీని 2024లో తీసుకున్నారు. క్రమం తప్పకుండా రెన్యువల్ చేస్తూ వస్తున్నారు. ఇన్సూరెన్స్ సంస్థ రూ.5లక్షల వరకు అనారోగ్య పరిస్థితుల్లో నగదు చెల్లించేవిధంగా పాలసీ తీసుకోవడం జరిగింది. రామాంజనేయులు కుమార్తె దార్మిక అనారోగ్యం పాలు కావడంతో ఆసుపత్రిలో చేర్పించారు. ఈ విషయాన్ని వెంటనే సంస్థకు వివరించారు. బిల్లుల మొత్తాన్ని ఇన్సూరెన్స్ కంపెనీకి అందజేయగా వారు క్లెయింను నిరాకరించడంతో రామాంజనేయులు వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌ను న్యాయవాదులు వెల్లంపల్లి నరేంద్ర స్వరూప్, కొల్లికొండ శరత్‌బాబు లను ఆశ్రయించారు. ఈ కేసును పరిశీలించి రూ. 39,537 లను ఏడు శాతం వడ్డీతో చెల్లించాలని మనో వేదనకు గురి చేసినందుకు రూ.10వేలు, ఖర్చుల నిమిత్తం మరో పది వేలు చెల్లించాలని 45 రోజుల్లో చెల్లింపులు పూర్తి చేయాలని కమిషన్ తీర్పునిచ్చింది.

# మోతి నగర్‌లో మహా అన్నదానం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** దేవీ నవరాత్రోత్సవాల సదర్భంగా మోతి నగర్‌లో మహా అన్నదాన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. అమ్మవారు మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ సిటీ ఛైర్మన్ గరికపాటి వెంకట్రావు, అన్నపూర్ణ దంపతులు మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ అమ్మవారి దయతో ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని కోరారు. ఎల్‌నినో కష్టాల నుంచి బయటపడాలని, నీటిని పొదుపుగా వాడుకుంటూ ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వెల్లంపల్లి వెంకట్రావు, ఉత్సవ కమిటీ సభ్యులు రవి, బాలిని శ్రీనివాస్, శ్రీనివాస్, ఎ. కృష్ణ, బి. శ్రీనివాస్ పాల్గొన్నారు.

# నవంబర్ చివరి నాటికి పనులు పూర్తి చేయాలి

**-నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నియోజకవర్గంలో నిర్మాణంలో ఉన్న వివిధ అభివృద్ధి పనులను నవంబర్ నాటికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ దివాకర టిఎస్ మున్నేరు నదిపై నిర్మాణంలో ఉన్న తీగల వంతెనతో పాటు రఘునాథపాలెంలోని ప్రభుత్వ వైద్య కళాశాల, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ పనులను అధికారులతో కలిసి ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ వేగం పెంచాలన్నారు. వైద్య కళాశాలకు సంబంధించి గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్ విద్యుద్దీకరణ, బాలికల హాస్టల్, అంతర్గత రహదారులు, తాగునీరు తదితర మౌలిక వసతుల పనులను సమాంతరంగా పూర్తి చేయాలన్నారు. బాలికల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. తీగల వంతెన తుది దశ పనులను ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ భవన నిర్మాణలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్‌కుమార్, ఆర్అండ్‌బి ఎస్ఈ యుగంధర్, తహసీల్దార్ శ్వేత పాల్గొన్నారు.

# అల్లిపురం వెంకటేశ్వరుని సన్నిధిలో భక్తుల రద్దీ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అల్లిపురం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. ఆలయ శంకుస్థాపన జరిగిన తర్వాత వచ్చిన మొదటి శనివారం కావడంతో ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. సుమారు మూ డువేల మందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించు కుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయ ప్రాంగణంలో పాలు పొంగించి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారికి నైవేద్యాలు సమర్పించారు. ఆయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. టెంట్లు, కూర్చోవడానికి కుర్చీలు, తాగునీరు ఏర్పాటు చేశారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

# సాంబయ్య సేవలు చిరస్మరణీయం




**ప్రజాపక్షం/ తల్లాడ :** పేద ప్రజల హక్కుల కోసం జరిగిన పోరాటాలకు పాలపాటి సాంబయ్య చేసిన సేవలు చిరస్మరణీయమని సిపిఎం జిల్లా నాయకులు కొనియాడారు. తల్లాడ మండలం అంజనాపురం గ్రామశాఖ సీనియర్ సభ్యుడు పాలపాటి సాంబయ్య సంస్మరణ సభను సిపిఎం మండల కార్యదర్శి ఐనాల రామలింగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు మాట్లాడుతూ పాలపాటి సాంబయ్య కుటుంబం పార్టీ అభివృద్ధికి, గ్రామంలో పార్టీని నిలబెట్టడానికి ఎనలేని కృషి చేసిందని గుర్తు చేశారు. సాంబయ్య కుటుంబం నేటికీ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ ప్రజా ఉద్యమాలకు అండగా నిలుస్తుందన్నారు. ఈ సంస్మరణ సభలో సిపిఎం సీనియర్ నాయకులు తాతా భాస్కర్‌రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు, మాచర్ల భారతి, యర్రా శ్రీనివాసరావు, మెరుగు సత్యనారాయణ, పాండురంగారావు, విటల్‌రావు, రాజాబాబు, సర్వేశ్వరరావు, ప్రకాషరావు, మోహన్‌రావు, కృష్ణయ్య, నరేష్, నాగేశ్వరరావు, కృష్ణయ్య, వెంకట నర్సయ్య పాల్గొన్నారు.